# ఐశ్వర్యం ఎదుట దారిద్ర్యం

శ్రీ శ్రీ

సాయంకాలం వీపుమీద సవారీచేస్తూ వచ్చిన కుంటి బిచ్చ కుర్రవాడు ఇరుకు సందులో బాడుగకు తీసుకున్న "ఈస్టు అండ్ వెస్టు ఎగుమతి దిగుమతుల కంపెనీ గుమ్మం ముందు నిలబడి "అంబా" అని అరిచాడు.

అమ్మతనానికి చిన్నప్పుడే దూరమై పెంట కుప్పల చాటున పెరిగిన కుంటి కుర్ర బిచ్చగాడు సూర్యుడి ప్రవేశం మొదలు చంద్రుడి నిష్క్రమణం దాకా, నేలనించి నీటినించి ఆకాశంద్వారా వ్యాపారంచేసే భవనముందు ఆకలి కణాల కిరణాల వ్రణాలు కుదిపితే కదిపితే కుములుతూ కములుతూ గొంతుకలో సగం ఎత్తి "అంబే" అని అరిచాడు.

వ్యాపార మందిరం లోపల రోజంతా తెగ వాగిన మోగిన టెలిఫోన్లూ, టైపురైటర్లూ మూకీ భావం వహించాయి. రోజంతా మనుష్యుల్ని మోసిన కుర్చీలు తీరుబాటుగా తమ అరణ్య ప్రారంభాలని జ్ఞాపకం చేసుకుంటున్నాయి.

కుర్ర బిచ్చ కుంటివాడు మొర్రో అని అరిచిన అరుపు కుర్చీలకి వినబడిందిగాని ఇంట్లో ఎవరూ లేరని చెప్పడానికి గొంతుక లేనివా కుర్చీలు. అంబా అని అరచిన అబ్బాయి కేకకి ఆ దారినే పోతున్న ఓ గోమాత ఆతడ్నే తన చేట పెయ్యి కాబోలునని అర క్షణం అనుమానించి తెలివైంది కాబట్టి తెలుసుకొని ముభావంగా ముట్టె ముడుచుకొని వెళ్ళిపోయింది.

ఇక్కడ బిచ్చం దొరకదని ఎవరు చెబుతారా కుర్రాడికి? లక్షలమీద వ్యాపారం జరిగే ఆ భవనంలో ఇప్పుడు పచ్చి మంచినీళ్ళుకూడా పుట్టవని టెలిఫోన్లు చెబుతాయా? టైపురైటర్లు చెబుతాయా? గదిలోని క్యాలండరు కాగితాలు గాలికి గలగల కొట్టుకొంటున్నాయేగాని ఈ కాస్త కబురు వాడికెలా అందజెయ్యగలుగుతాయి?

వొచ్చిన పాటకూడా మరిచిపోయిన బిచ్చ కుంటి కుర్రవాడి మొగంలో సాయంకాలపు జేగురు రంగు పిచికగూళ్ళు కడుతోంది. విసుగుతో పోరాడుతూ అణగారిపోతూన్న ఆశని ఎగసన దోసుకుంటూన్న కుర్రకుంటి బిచ్చగాడి కడుపులోని రంపాలు పుట్టిస్తున్నాయి కళ్ళలో భూకంపాలు. అసందర్భంగా పుట్టి అనవసరంగా పెరిగి అఘోరిస్తూన్న బిచ్చ కుర్రకుంటివాడి పిడచకట్టిపోయిన నాలిక ఓడిపోయిన రాజ్యంతాలూకు వెలిసిపోయిన పతాకం లాగ వేలాడుతోంది.

అనంతంగా అక్కడే నిలబడిపోతాడా యేమిటూ కుర్రాడు? ఈ కథ ఎక్కడికీ కదలదా యేమిటి? ఆ కదలని కాళ్ళు నేలలోకి కుంరుకుపోయి వేళ్ళుతన్ని కుర్రాడే ఒక మర్రిచెట్టయి పోతాడేమిటి?

చింపిరిజుత్తు బికారివాడి తలకాయ పెట్టెలోని దరిద్రపుసామాన్లు వర్ణిస్తూ, ఎదురుగుండా కంపెనీ భవనంలోని ఖరీదైన వస్తువుల ఐశ్వర్యాన్ని సూచిస్తూ ఎంతసేపైనా ఈ రచనని సాగించవచ్చు. సందులో సహా సౌందర్యాన్ని సంకరిస్తూన్న సంధ్యాకాలపు మాధుర్యాన్ని రకరకాల ఉపమానాలతో ప్రశంసించవచ్చు. అయినా ఈ కథ ఎక్కడ ప్రారంభమయిందో అక్కడే ఉంటుంది.

ఎప్పటికైనా ఆ బిచ్చగాడు కుంటివాడు కుర్రవాడు తలయెత్తిచూసి తలుపుకివేసిన తాళం కప్ప ఇచ్చే సందేశాన్ని అర్థం చేసుకోగలిగితే, అయ్యా అని అరిచిన నోరు అయ్యో అని నిరాశప్రకటిస్తే, ఆ యింటిముందు నిలబడడంవల్ల లాభంలేదని ఆఖరికతనికాళ్ళకి బోధపడితే అప్పుడీ కథ అంతమవుతుంది.

★